

హౌసింగ్ ఫైనాన్స్ ప్రారంభం

ఎల్ఐసీ హౌసింగ్ ఫైనాన్స్ క్లస్టర్ కార్యాలయాన్ని విశాఖలోని ఎల్ఐసీ జీవన్ సమృద్ధి ప్రాంగణంలో ప్రారంభించారు. 8లో



ఘనంగా పంచామృతాభిషేకం

విశాఖలో కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో గురువారం త్రికాల పంచామృతాభిషేకం జరిపారు.

గరిష్ఠం/కనిష్ఠం
33.0/27.0

వాతావరణం

తేలికపాటి నుంచి మోస్తరు వర్షం ఒకటి రెండు చోట్ల పడే అవకాశం ఉందని ఆర్ఏఆర్ఎస్ వాతావరణ విభాగం శాస్త్రవేత్త వి.గౌరి తెలిపారు.

న్యూస్‌రీల్

కైలాసగిరిపై రామ్‌చరణ్ సందడి



ఎయిర్‌పోర్టు నుంచి బయటకు వస్తున్న నటుడు రామ్‌చరణ్

కొమ్మాది: మెగా పవర్ స్టార్ రామ్‌చరణ్ గురువారం కైలాసగిరి కొండపై సందడి చేశారు. ప్రముఖ దర్శకుడు శంకర్ దర్శకత్వంలో తెరకెక్కిస్తున్న 'గేమ్ ఛేంజర్' సినిమాకు సంబంధించిన కొన్ని సన్నివేశాలను ఇక్కడ చిత్రీకరించారు. పొలిటికల్, యాక్షన్, థ్రిల్లర్ కథాంశాలతో తెరకెక్కిస్తున్న ఈ సినిమాలో రామ్‌చరణ్ కలెక్టర్ పాత్రలో నటిస్తున్నారు. గురువారం మధ్యాహ్నం విశాఖ వచ్చిన ఆయన.. కైలాసగిరిపై జరిగిన షూటింగ్‌లో పాల్గొన్నారు. అనంతరం నోవాటెల్‌కు చేరుకున్నారు. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై ఈ సినిమాను దిల్ రాజు నిర్మిస్తున్నారు. శుక్రవారం ఉదయం ఆర్.కె.బీచ్ వద్ద పలు సన్నివేశాలు చిత్రీకరణ అనంతరం తిరిగి ఆయన హైదరాబాద్‌కు పయనమవుతారు.

- బీచ్‌రోడ్డులోని మంగమారిపేట రామాద్రి బీచ్ వద్ద ఆదివారం నటుడు నాగచైతన్య సందడి చేయనున్నారు. ఆయన నటిస్తున్న ఓ సినిమా కోసం బీచ్ వద్ద సెట్ ఏర్పాటు చేశారు.

ఆగస్టులో టీటీసీ పరీక్షలు

అనకాపల్లి: టెక్నికల్ టీచర్స్ సర్టిఫికెట్(టీటీసీ) లోయర్ గ్రేడ్ పరీక్షలు ఆగస్టులో నిర్వహించనున్నట్లు డీఈవో ఎం.వెంకటలక్ష్మమ్మ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 42 రోజుల శిక్షణ కోర్సు పూర్తి చేసుకున్న వారు పరీక్షలకు సిద్ధం కావాలన్నారు. అర్హులైన అభ్యర్థులు పరీక్ష రుసుము, పరీక్ష కేంద్రాలకు సంబంధించిన వివరాలను www.bse.ap.gov. in వెబ్‌సైట్‌ను సంప్రదించి, తెలుసుకోవాల్సిందిగా కోరారు.

జూలై 29 నుంచి ప్రత్యేక లోక్ అదాలత్‌లు

విశాఖ లీగల్: సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారం కోసం జూలై 29 నుంచి ఆగస్టు 3వ తేదీ వరకు సుప్రీం కోర్టు ఆధ్వర్యంలో ప్రత్యేక లోక్ అదాలత్‌లు నిర్వహించనున్నట్లు జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్ తెలిపారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఫిజికల్/వర్చువల్ విధానంలో ముందస్తుగా సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారం కోసం ప్రీ లోక్ అదాలత్‌లు నిర్వహించి కేసులు రాజీ చేసుకునేందుకు కక్షిదారులకు వీలు కల్పిస్తున్నట్లు వివరించారు. నోటీసులు అందుకున్న కక్షిదారులు జిల్లా న్యాయ సేవాధికార సంస్థలో సంప్రదించాలన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసులను ఫిజికల్ లేదా వర్చువల్ విధానంలో పరిష్కరించుకోవాలని పర్మినెంట్ లోక్ అదాలత్ అధ్యక్షుడు జి.వల్లభనాయుడు, విశాఖ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎం.వి.శేషమ్మ కక్షిదారులకు హితవు పలికారు. వివరాలకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థలేదా టోల్ ఫ్రీ నెంబర్ 15100ను సంప్రదించవచ్చని సూచించారు.

బడి బస్సులు భద్రం

- ఫిట్‌నెస్ ఉంటేనే బడి బస్సుకు అనుమతి
- ఆర్టీవో కార్యాలయంలో ఫిట్‌నెస్ టెస్ట్
- అనుమతులు లేకుండా నడిపితే సీజ్
- జిల్లాలో 377 బడి బస్సులకు అనుమతులు
- జిల్లా రవాణా అధికారి మనోహర్



బడి బస్సు ప్రమాణాలను పరిశీలిస్తున్న రవాణా శాఖ అధికారి

తుమ్మపాల: బడి బస్సుల ఫిట్‌నెస్‌పై జిల్లా యంత్రాంగం దృష్టి సారించింది. గతేడాది జారీ చేసిన ఫిట్‌నెస్ సర్టిఫికెట్(ఎఫ్‌సీ) గడువు ఈ నెల 15తో ముగియనుండడంతో నూతన విద్యా సంవత్సరంలో బడి బస్సులకు కొత్త సర్టిఫికెట్ల జారీకి తనిఖీలు చేపట్టింది. ఈ ప్రక్రియ దాదాపు చివరి దశకు చేరుకుంది. ప్రమాదాలకు తావులేకుండా, కండిషన్లో ఉన్న బస్సులను మాత్రమే అనుమతించేలా ఆర్టీవో అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఫిట్‌నెస్ లేని, నిబంధనల మేరకు బస్సును సిద్ధం చేయకపోతే వెనక్కి తిప్పి పంపిస్తున్నారు. అలాంటి బస్సులు రోడ్లపై తిరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తున్నారు.

జిల్లాలో మొత్తం 419 బస్సులు

జిల్లాలో వివిధ పాఠశాలలు, కళాశాలలకు చెందిన బస్సులు 419 ఉన్నాయి. అనకాపల్లి ఆర్టీవో కార్యాలయంలో 244, నర్సీపట్నం కార్యాలయంలో 133 కలిపి, మొత్తం 377 బస్సులకు ఫిట్‌నెస్ అనుమతులు మంజూరు చేశారు. మరో 42 బస్సులకు మాత్రమే ఫిట్‌నెస్ మంజూరు చేయాల్సి ఉంది. బడి బస్సుల వేగం గంటకు 60 కిలో మీటర్ల మించ రాదు. ఆ మేరకు స్పీడ్ లాక్ వేస్తారు.

ఫిట్‌నెస్ లేకుంటే తిరస్కరణ

నిబంధనలకు విరుద్ధంగా, సరైన ప్రమాణాలు లేని బస్సులకు ఫిట్‌నెస్ తిరస్కరిస్తూ, ఆర్టీవో అధికారులు వాటిని వెనక్కిపంపిస్తున్నారు. పలు కార్పొరేట్ విద్యాసంస్థల బస్సుల్లో ఫస్ట్ ఎయిడ్ బాక్స్‌లు లేకపోవడం, ఆటోమేటిక్ డోర్ సిస్టం, ఎగ్జిట్ డోర్స్, సరైన బ్రేకులు, మిర్రర్స్, సీట్లు వంటి సౌకర్యాల లేమిని అధికారులు గుర్తించారు. వాటిని సరిదిద్దాకే ఫిట్‌నెస్ టెస్ట్‌కు రావాలని చెప్తున్నారు.

బడిబస్సు ఫిట్‌నెస్ నిబంధనలు

- బస్సుకు సంబంధించిన అన్ని లైట్లు పనిచేయాలి.
- రిఫ్లెక్టివ్ టేపును బస్సుకు నాలుగు వైపులా అతికించాలి.
- బస్సుకు ఉన్న గ్లాసులన్నీ పటిష్టంగా ఉండేలా చూడాలి.
- బస్సు నుంచి అధిక మొత్తంలో బ్లాక్ స్మోక్ (పొగ) రాకుండా చూసుకోవాలి.
- బ్రేక్ కండిషన్‌లో ఉండాలి. హ్యాండ్ బ్రేక్, స్పీడో మీటర్ సక్రమంగా పనిచేయాలి.
- స్టీరింగ్, టైర్ల కండిషన్ ఎప్పటికప్పుడు సరిచూసుకోవాలి.
- బస్సును నడిపే డ్రైవర్‌కు బీపీ, సుగర్, కంటి సంబంధిత సమస్యలు ఉండరాదు. డ్రైవర్ మెడికల్ సర్టిఫికెట్ సమర్పించాలి.
- ప్రతి బస్సులో మందులు, పరికరాలతో కూడిన ప్రథమ చికిత్స కిట్ అందుబాటులో ఉంచాలి.



బడి బస్సులో భద్రత ప్రమాణాలను తనిఖీ చేస్తున్న రవాణా శాఖ సిబ్బంది

- నెలకోసారి పేరెంట్స్ కమిటీ బస్సును చూసి, తమ సానుకూలత తెలిపేలా ప్రత్యేక రిజిస్టర్ నిర్వహించాలి.
- సైడ్ విండోలకు మధ్యలో మూడు అంగుళాలకు మించని దూరంలో అడ్డంగా మూడు లోహపు కడ్డీలు అమర్చాలి.
- బస్సు నడిపే డ్రైవర్ కనీసం ఐదేళ్ల అనుభవం, 60 ఏళ్ల లోపు వయసు కలిగి ఉండాలి.
- బస్సు మెట్లు జారకుండా ఉండేలా లోహంతో చేయించాలి.
- బస్సులో అత్యవసర ద్వారం, మంటలను ఆర్పే పరికరం ఏర్పాటు చేసుకోవాలి.
- అత్యవసర ద్వారం అని స్పష్టంగా తెలిసేలా రాయించాలి.
- విద్యార్థులు బస్సు ఎక్కేటప్పుడు, దిగేటప్పుడు బస్సు అటెండెంట్ పర్యవేక్షించాలి.
- సీటింగ్ కెపాసిటీకి మించి విద్యార్థులను ఎక్కించరాదు.
- ప్రతి నెలా బస్సు కండిషన్‌ను యాజమాన్యాలు, పాఠశాల పేరెంట్స్ కమిటీ తనిఖీ చేయాలి.
- బస్సులో ఫిర్యాదుల పుస్తకం ఉంచాలి.
- బస్సులో అటెండర్ తప్పకుండా యూనిఫామ్ ధరించాలి.
- వెనుక నుంచి వచ్చే వాహనాలను చూసేందుకు వీలుగా బస్సు డ్రైవర్‌కు కుడి, ఎడమ వైపు బయట, లోపల మిర్రర్స్ ఏర్పాటు చేయాలి.

మండలాల వారీగా బడి బస్సులు

మండలం	బస్సులు	మండలం	బస్సులు
అనకాపల్లి	69	నర్సీపట్నం	47
అచ్యుతాపురం	37	నాతవరం	03
బుచ్చెయ్యపేట	04	పరవాడ	44
చోడవరం	33	పాయకరావుపేట	34
దేవరాపల్లి	04	రాంబిల్లి	11
గొలుగొండ	02	రావికమతం	12
కె.కోటపాడు	02	రోలుగుంట	02
కశింకోట	22	ఎస్.రాయవరం	19
కోటవురట్ల	01	సబ్బవరం	25
మాకవరపాలెం	28	వి.మాడుగుల	03
మునగపాక	10	యలమంచిలి	05
నక్కపల్లి	02		

- బస్సు ఎట్టి పరిస్థితుల్లో రాంగ్ రూట్లో ప్రయాణించకూడదు.

ఎఫ్‌సీ లేని బస్సుల్ని సీజ్ చేస్తాం



బడి బస్సులకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్(ఎఫ్‌సీ) తప్పనిసరి. ఈ నెల 15 లోపు ఎఫ్‌సీ చేయించుకోవాలి. పాఠశాలలు ఇప్పటికే ప్రారంభమయ్యాయి. ఎఫ్‌సీ లేకుండా తిరిగే బస్సులపై స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తాం. అలాంటివి రోడ్లపై తిరుగుతున్నట్లు మా దృష్టికి వస్తే తక్షణమే సీజ్ చేస్తాం. మరమ్మతులు, నిబంధనలకు విరుద్ధంగా ఉన్న కొన్ని బస్సులకు ఎఫ్‌సీ మంజూరు చేయకుండా వెనక్కి పంపించేశాం. ఎఫ్‌సీ, పర్మిట్, కండిషన్ లేని బస్సులను సీజ్ చేయడంతోపాటు, ఆ యాజమాన్యాలపై చర్యలు తీసుకుంటాం.

–జి.మనోహర్, జిల్లా రవాణా శాఖ అధికారి, అనకాపల్లి

సందడిగా సరస్వతీ నిలయాలు



అనకాపల్లి వేల్పులవీధి బాలికోన్నత పాఠశాలలో ప్రార్థన చేస్తున్న విద్యార్థులు



అనకాపల్లి ఉడ్‌పేట ప్రాథమిక పాఠశాలలో చదువుకు శ్రీకారం



అనకాపల్లి మెయిన్‌రోడ్డు పెద్ద హైస్కూల్లో ఉపాధ్యాయులకు సూచనలు చేస్తున్న డీఈవో వెంకటలక్ష్మమ్మ

- తెరచుకున్న పాఠశాలలు
- పంపిణీ కాని స్టూడెంట్ కిట్లు

అనకాపల్లి: కొత్త విద్యా సంవత్సరం ఆరంభమైంది. వేసవి సెలవుల అనంతరం గురువారం జిల్లాలో పాఠశాలలు తెరుచుకున్నాయి. బడి గంటలు గణగణ మోగాయి. సెలవుల్లో ఆటలాడుకుంటూ గడిపిన పిల్లలు పాఠశాలలకు వెళ్లడానికి అయిష్టంగానే బయలుదేరారు. తొలిరోజు కావడంతో తల్లిదండ్రులు తమ పిల్లలను స్కూల్ వరకు దిగబెట్టారు. ద్విచక్ర వాహనాలు, ఆటోలతో పిల్లల్ని తీసుకువెళ్లడంతో రోడ్లు, పాఠశాలల వద్ద రద్దీ నెలకొంది. తొలి రోజు నుంచే మధ్యాహ్న భోజనం పథకం విద్యార్థులకు అందుబాటులోకి వచ్చింది.

స్టూడెంట్ కిట్ల ఊసే లేదు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు పాఠశాలలు తెరిచిన మొదటి రోజే పుస్తకాలతో సహా విద్యాకానుక కిట్లను పంపిణీ చేసేవారు. ఈ ఏడాది స్టూడెంట్ కిట్లు పూర్తిగా చేరలేదు. 60 శాతం కిట్లు కూడా రాకపోవడంతో పంపిణీ ప్రారంభించలేదు. పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు కూడా పూర్తి స్థాయిలో పాఠశాలలకు చేరలేదు. తొలి రోజు పుస్తకాలను బడికి చేరవేసే పనితో ఉపాధ్యాయులు బిజీగా గడిపారు. స్టూడెంట్ కిట్లను రెండు రోజుల్లో విద్యార్థులకు పంపిణీ చేస్తామని అధికారులు పేర్కొన్నారు.

విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలి

ఉపాధ్యాయులు విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటలక్ష్మమ్మ అన్నారు. అనకాపల్లిలోని జీవీఎంసీ మెయిన్‌రోడ్డు పెద్ద హైస్కూల్, వేల్పులవీధి బాలికోన్నత హైస్కూళ్లను గురువారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాఠశాలలకు నోట్, టెస్ట్ పుస్తకాలను పంపించామన్నారు. ప్రతీ విద్యార్థి యూనిఫారం తప్పనిసరిగా ధరించాలని, విద్యార్థుల హాజరును ఆన్‌లైన్లో నమోదు చేయాలని చెప్పారు. పాఠశాలలకు రాని విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలని, మధ్యాహ్న భోజనం ప్రతి విద్యార్థికి అందజేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎంలు రుధిరరాణి, శర్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వుషు క్రీడలో అరుణకు గోల్డ్ మెడల్



బంగారు పతకంతో అరుణ

అనకాపల్లి: సౌత్‌జోన్ ఖేలో ఇండియా వుషు 2024–25 పోటీల్లో అనకాపల్లి మండలం అక్కిరెడ్డిపాలెం పంచాయతీ తారకరామారావు కాలనీకి చెందిన కోరుకొండ అరుణ 65 కిలోల విభాగంలో బంగారు పతకం సాధించినట్లు కోచ్ దువ్వాడ హరీష్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 10 నుంచి 13 వరకూ కర్ణాటకలోని భగల్‌కాట్‌లో సౌత్‌జోన్ ఖేలో ఇండియా వుషు పోటీలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఈ పోటీల్లో ఏపీ, తెలంగాణ, ఒడిశా, తమిళనాడు, కేరళ, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నట్లు తెలిపారు. వుషు పోటీల్లో అరుణ ప్రథమ స్థానంలో నిలిచి, గోల్డ్ మెడల్ సాధించడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు.

టీడీపీ దాడులకు భయపడొద్దు

- కార్యకర్తలకు ఎల్లప్పుడూ పార్టీ అండగా నిలుస్తుంది
- కార్పొరేషన్, స్థానిక సంస్థల్లో ప్రలోభాలకు గురిచేసే అవకాశం
- కేంద్రంలో ఎన్డీయేకు పూర్తి స్థాయి మెజారిటీ లేదు
- పార్లమెంట్‌లో వైఎస్సార్‌సీపీ ఎంపీలు కీలకం
- కార్పొరేటర్లతో వైవీ సుబ్బారెడ్డి సమావేశం
- భవిష్యత్ కార్యాచరణపై దిశానిర్దేశం

సాక్షి, విశాఖపట్నం: వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై టీడీపీ మూకల దాడులకు ఎవరూ భయపడవద్దని, పార్టీ శ్రేణులకు, నాయకులకు, కార్యకర్తలకు పార్టీ ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందని వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్, రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి భరోసా ఇచ్చారు. ఎండాడ లా కాలేజీ సమీపంలోని పార్టీ కార్యాలయంలో కార్పొరేటర్లు, పార్టీ ముఖ్యనాయకులతో గురువారం ఆయన సమావేశం నిర్వహించారు. భవిష్యత్ కార్యాచరణపై దిశానిర్దేశం చేశారు. రాష్ట్రంలో ఎన్డీయే కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై దాడులకు తెగబడుతూ, భయానక వాతావరణాన్ని సృష్టిస్తున్నారని ఆక్షేపించారు. అంతేకాకుండా కార్పొరేషన్, స్థానిక సంస్థల్లో ప్రలోభాలకు గురిచేసే అవకాశం ఉందని, వారి ప్రలోభాలను తిప్పికొట్టాలని అప్రమత్తం చేశారు. కేంద్రంలో ఎన్డీయే ప్రభుత్వానికి పూర్తి మెజారిటీ లేని పరిస్థితుల్లో వైఎస్సార్‌సీపీ బలమైన నలుగురు లోక్‌సభ సభ్యులు, 11 మంది రాజ్యసభ సభ్యులు కీలకం కానున్నారని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రయోజనాలకు అనుగుణంగా పార్టీ అధినేత నిర్ణయాలు తీసుకుంటారని తెలిపారు. సమావేశంలో మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, నగర మేయర్ గొలగాని హరివెంకటకుమారి, మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, జీవీఎంసీ డిప్యూటీ మేయర్లు జియ్యాని శ్రీధర్, కె.సతీష్, జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాస్, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ శంకరరావు, కార్పొరేటర్లు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.



కార్పొరేటర్ల సమావేశంలో మాట్లాడుతున్న వైవీ సుబ్బారెడ్డి చిత్రంలో మేయర్ హరి వెంకట కుమారి, తదితరులు

పైకప్పుపై 'పవర్'!

- ఇంటిలో సోలార్ పవర్ ఉత్పత్తికి శ్రీకారం
- సబ్సిడీతో పాటు రుణ సదుపాయం కల్పిస్తున్న కేంద్రం
- పీఎం సూర్యఘర్‌కు విశాఖ సర్కిల్ పరిధిలో 452 దరఖాస్తులు
- నెట్ మీటర్‌తో విద్యుదుత్పత్తి, వినియోగం తెలుసుకునే అవకాశం
- కిలోవాట్ సోలార్ రూఫ్‌టాప్‌తో నెలకు 125 యూనిట్ల వరకూ విద్యుదుత్పత్తి

ఏ ఇంటికైనా నెల వచ్చిందంటే భయపెట్టేది కరెంటు బిల్లే. గృహ విద్యుత్తు దాదాపుగా ప్రతి రాష్ట్రంలోనూ వినియోగదారులకు భారంగానే మారుతోంది. ఈ నేపథ్యంలో గృహ వినియోగదారులు స్వయంగా విద్యుత్‌ని ఉత్పత్తి చేసుకుంటే కరెంటు బిల్లు బెడద లేకుండా హాయిగా ఉండొచ్చు. కేవలం విద్యుత్తు ఉత్పత్తి చేసుకోవడమే కాదు.. మనం వాడుకోగా మిగిలిన కరెంటును ఎంచక్కా డిస్కంలకు అమ్మి సొమ్ము చేసుకునే ప్రయోజనం కూడా ఉంటుంది. భవిష్యత్ విద్యుత్ అవసరాల దృష్ట్యా కేంద్రం సరికొత్త విధానాలను అమల్లోకి తెచ్చింది. అందులో సోలార్ విద్యుత్ ఉత్పత్తికి ప్రాధాన్యత ఇస్తోంది. సోలార్ విద్యుత్ తయారీకి సబ్సిడీ, రుణ సదుపాయం కల్పించింది. ఆసక్తిదారులు 'పీఎం సూర్యఘర్' పథకం ద్వారా సౌర విద్యుత్ ఉత్పత్తి చేసుకునే సౌకర్యం కల్పించింది.

సాక్షి, విశాఖపట్నం :

మన ఇంట్లోనే సూర్యరశ్మి ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేసుకునేలా కేంద్ర ప్రభుత్వం 'పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన'ను ప్రవేశపెట్టింది. ఈ పథకంలో చేరాలంటే ముందుగా 'సూర్యఘర్' యాప్‌ని మొబైల్లో ఇన్‌స్టాల్ చేసుకోవాలి. అందులో వివరాలు నమోదు చేయాలి. ఆరు నెలల కరెంటు బిల్లు కాపీని జతపరచాలి. తరువాత రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. విద్యుత్ వాడకం 300 యూనిట్లలోపు మాత్రమే ఉండాలన్న నిబంధన ఉంది. తదుపరి ట్రాన్స్‌కో అనుమతులు పొందాక వెండర్లను ఎంపిక చేసుకోవాలి. ఇందులో కిలో వాట్‌కు నిర్ణయించిన దాని ప్రకారం రాయితీని అందిస్తారు. మిగిలిన మొత్తానికి బ్యాంకు రుణ సదుపాయం కల్పించనున్నారు. చివరగా ఇంటి రూఫ్‌పై 100 చదరపు అడుగుల స్థలంలో సోలార్ ప్యానల్స్ ఏర్పాటు చేస్తారు. ప్రస్తుతం వాడే మీటర్ స్థానంలో 'నెట్ మీటర్' ఏర్పాటు చేస్తారు. దీని ద్వారా సోలార్ ఉత్పత్తి.. వినియోగదారుడు వాడుతున్న విద్యుత్‌ని గణిస్తారు. ఈపీడీసీఎల్‌లోని విశాఖపట్నం సర్కిల్‌లో ఇప్పటి వరకు 452 మంది ఈ పథకం కింద దరఖాస్తు చేసుకున్నారు. దేశవ్యాప్తంగా కోటి ఇళ్లపైన సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించుకుంది.

దరఖాస్తు చేసేందుకు అవసరమైన పత్రాలు

- ఆధార్ కార్డు
- నివాస ధ్రువీకరణ పత్రం
- విద్యుత్ బిల్లు
- బ్యాంకు పాస్ బుక్
- పాస్‌పోర్ట్ సైజు ఫొటో
- రేషన్ కార్డు
- మొబైల్ నంబర్
- అఫిడవిట్
- ఆదాయ ధ్రువీకరణ పత్రం

రూ.78 వేల వరకు సబ్సిడీ

కేంద్ర ప్రభుత్వ ప్రకటన ప్రకారం, ఒక కిలోవాట్ సోలార్ ప్యానెల్ సిస్టమ్ ఏర్పాటు కోసం కేంద్ర ప్రభుత్వం రూ.30 వేలు సబ్సిడీ ఇస్తుంది. 2 కిలోవాట్ల ప్యానల్‌కు రూ.60 వేలు సబ్సిడీ, 3 కిలోవాట్ల సోలార్ ప్యానల్ సిస్టమ్‌కు రూ.78 వేలు సబ్సిడీ ఇస్తుంది. సబ్సిడీ పోను, సోలార్ ప్యానెళ్ల ఏర్పాటుకు వెచ్చించే అదనపు ఖర్చును బ్యాంక్‌లోన్ రూపంలో పొందొచ్చు. దీనిపై తక్కువ వడ్డీ తీసుకుంటారు. ఈ లోన్ కోసం బ్యాంక్‌లకు ప్రజలు ఎలాంటి పూచీకత్తు సమర్పించాల్సిన అవసరం లేదు. కేంద్ర ప్రకటన ప్రకారం ఇంటి పైకప్పుపై గరిష్టంగా 3 కిలోవాట్ల సామర్థ్యంతో సౌర ఫలకాలు బిగించుకోవడానికి 7% వడ్డీ రేటుతో కొలేటరల్ ఫ్రీ లోన్ (తాకట్టు లేని రుణం) అందుబాటులో ఉంటుంది.

30 రోజుల్లో రాయితీ

నెట్ మీటర్ అమర్చిన తరువాత వినియోగదారులు 'పోర్టల్'లో బ్యాంక్ ఖాతా వివరాలు అప్‌లోడ్‌చెయ్యాలి. సబ్సిడీ మొత్తాన్ని ప్రభుత్వం 30 రోజుల్లోనే వినియోగదారుడికి చెల్లిస్తుంది. ఒక కిలో వాట్ రూఫ్ టాప్ కెపాసిటీ కోసం 3–4 ప్యానల్స్ (1 మీటరు వెడల్పు – 1.6 మీటర్ల ఎత్తు)ని అమర్చనున్నారు. ఒక కిలో వాట్ సోలార్ రూఫ్ టాప్ ప్యానల్ నెలకు దాదాపు 125 పైగా యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి చేస్తుంది. సోలార్ రూఫ్ టాప్ ప్యానల్స్ సూర్యరశ్మిని నిలిపేసుకోవడం వల్ల ఇల్లు చల్లగా ఉంటుందని నిపుణులు అంటున్నారు. వినియోగదారుడు పెట్టిన పెట్టుబడి ఆరు నుంచి ఏడేళ్లలో తిరిగి పొందగలరని అధికారులు చెబుతున్నారు.



ఇంటిపై సోలార్ ప్యానెల్స్

సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన అర్హతలు, అనర్హతలు

- దరఖాస్తుదారుడు భారతీయ పౌరుడై ఉండాలి.
- వయస్సు 21 సంవత్సరాలు దాటి ఉండాలి.
- సోలార్ ప్యానెళ్ల వ్యవస్థ ఏర్పాటు చేయడానికి స్థలం ఉండాలి.
- దరఖాస్తుదారు వార్షిక వేతనం రూ. 1.5 లక్షల కంటే ఎక్కువ ఉండకూడదు.
- పేద, మధ్య తరగతి కుటుంబాలకు ప్రాధాన్యత ఉంటుంది.
- దరఖాస్తుదారు గానీ, అతని కుటుంబంలో గానీ ప్రభుత్వ ఉద్యోగి/ఉద్యోగులు ఉంటే అనర్హులు.
- దరఖాస్తుదారు దగ్గర అవసరమైన సరైన పత్రాలు ఉండాలి.
- దరఖాస్తుదారు బ్యాంక్ ఖాతా ఆధార్ కార్డ్ లింక్ అయి ఉండాలి.

అర్హులు దరఖాస్తు చేసుకోవాలి



వినియోగదారులే సోలార్ విద్యుత్ ఉత్పత్తి చేసుకునేలా చూసే 'సూర్యఘర్' అద్భుతమైన పథకం. సోలార్ విద్యుత్ ప్యానళ్ల ఏర్పాటుకు ప్రభుత్వం రాయితీ, రుణ సదుపాయం కల్పిస్తోంది. అర్హులందరూ దరఖాస్తు చేసుకోవచ్చు. నెట్ మీటర్ విధానం ద్వారా ఎంత విద్యుత్ ఉత్పత్తి అయ్యింది.. అందులో ఎంత మేర వినియోగిస్తున్నాం అనే వివరాలు కూడా సులువుగా తెలుసుకోవచ్చు. సందేహాలుంటే ట్రాన్స్‌కో అధికారులతో నివృత్తి చేసుకునే అవకాశం ఉంది.

–ఎల్.మహేంద్రనాథ్, ఈపీడీసీఎల్ ఎస్ఈ

కేజీహెచ్‌కు లారీ ప్రమాద బాధితుల తరలింపు


క్షతగాత్రుల బంధువులతో మాట్లాడుతున్న కేజీహెచ్ సూపరింటెండెంట్ శివానంద్

సాక్షి,పాడేరు: ఘాట్‌లో లారీ బోల్తా ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వారిని స్థానిక జిల్లా ఆస్పత్రిలో చికిత్స అనంతరం కేజీహెచ్‌కు తరలించారు. క్షతగాత్రుల్లో రాజు, గణేష్, పవన్‌ను బుధవారం రాత్రి తరలించగా మిగిలిన తొమ్మిది మందికి ఇక్కడే వైద్యసేవలు అందించారు. గురువారం ఉదయం వీరందరికీ స్కానింగ్, ఇతర వైద్యపరీక్షలు నిర్వహించారు. వారిని కూడా కేజీహెచ్‌కు తరలించాలని కలెక్టర్ విజయసునీత ఆదేశించారు. ఈ మేరకు లంక శ్రీను (యలమంచిలి), వి.మోహన్ (ధర్మవరం), లంక దీక్షిత (యలమంచిలి), బి.రవి(షేకిళ్లపాలెం), గొర్లె రోహిత్‌కుమార్ (షేకిళ్లపాలెం), పి.భారతి (కొత్తపాలెం),లంక సునీత(యలమంచిలి)తో పాటు మరో ఇద్దరిని ప్రత్యేక అంబులెన్సుల్లో కేజీహెచ్‌కు తీసుకువెళ్లారు

మృతదేహాలకు పోస్టుమార్టం

లారీ బోల్తా ఘటనలో హరీష్, లక్ష్మణ్, అశోక్ మృతి చెందారు. వీరి మృతదేహాలకు జిల్లా ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం వారి బంధువులు, కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఎస్‌ఐ లక్ష్మణరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నలుగురికి వైద్య సేవలు

మహారాణిపేట (విశాఖ) : అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు ఘాట్ రోడ్డులో జరిగిన రోడ్డు ప్రమాదంలో క్షతగాత్రులను కేజీహెచ్‌కు తీసుకువచ్చారు. వీరిలో నలుగురికి కేజీహెచ్‌లో వైద్య సేవలందిస్తున్నారు. ఈ ప్రమాదంలో గాయపడిన ఆడారి నితిన్‌కుమార్ (20), కె.పవన్ (19), ఎస్.గణేష్ (30), ఈఎస్‌వీ రాజు (20)కు అందిస్తున్న వైద్య సేవలను గురువారం సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద్ పర్యవేక్షించారు. క్షతగాత్రుల్లో రాజు ప్రాథమిక వైద్యం అనంతరం కేజీహెచ్ నుంచి పరారైనట్లు వైద్యులు తెలిపారు. ప్రస్తుతం కేజీహెచ్‌లో ముగ్గురికి వైద్య సేవలందిస్తున్నట్టు సూపరింటెండెంట్ తెలిపారు. బాధితులకు ఆర్థోపెడిక్, ఇతర జనరల్ వైద్యులు సేవలందిస్తున్నారు.

రక్తదాతలకు సలాం



నేడు ప్రపంచ రక్తదాతల దినోత్సవం

దాబాగార్డెన్స్ (విశాఖ): అన్నిదానాల్లో కెల్లా.. రక్తదానం గొప్పది. సకాలంలో రక్తం అందక ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారు. మనమిచ్చే రక్తం మరొకరి ప్రాణాలు కాపాడుతుంది. ప్రమాదాల్లో చనిపోతున్న వారు కొందరైతే, తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చేరి రక్తం అందక చనిపోయే వారు ఎక్కువ మందే ఉన్నారు. బాధితుల బాధలు, ఇబ్బందులు కళ్లారా చూసిన యువకులు, దాతలు పెద్ద ఎత్తున రక్తదానం చేస్తూ స్ఫూర్తిగా నిలుస్తున్నారు. నేడు ప్రపంచ రక్తదాతల దినోత్సవం. కార్ల్ ల్యాండ్‌స్టెనర్ అనే జీవ శాస్త్రవేత్త బ్లడ్ గ్రూప్‌లను కనుగొన్నందుకు గానూ వైద్య శాస్త్రంలో 1930లో ఆయనకు నోబెల్ బహుమతి లభించింది. ఆయన జయంతి గుర్తింపుగా రక్తం విలువను ప్రజలకు తెలియజేసేందుకు ఏటా జూన్ 14న ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం.

శతాధిక రక్తదాత


117 సార్లు రక్తదానం చేసిన సూరాడ అప్పారావు(ఫైల్)

వివేకానందుడి బాటలో నడుస్తూ అన్నార్తులను అక్కున చేర్చుకుంటున్న స్వామి వివేకానంద స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు.. రక్తదానం చేస్తూ పలువురికి ప్రాణదాతగా నిలుస్తున్నారు. ఇప్పటి వరకు ఆయన 117 సార్లు రక్తదానం చేశారు. '2004లో కళావతి అనే మా ఆప్తురాలిని బతికించుకునేందుకు రక్తదానం చేశాను. అయితే ఆమె బతకలేదు. అప్పుడే రక్తం అవసరాన్ని గుర్తించాను. 2002లోనే స్వామి వివేకానంద స్వచ్ఛంద సేవా సంస్థను ప్రారంభించాను. సంస్థ అధ్యక్షుడిగా ముందుండి రక్తదానం చేస్తుండడంతో ఎంతో మంది యువకులు ముందుకు వస్తున్నారు. రక్త కొరత తీర్చాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఏడాదికి మూడు సార్లు రక్తదానం చేస్తున్నాను. తాను రక్తదానం చేయడమే కాకుండా.. రక్తదానంపై యువతలో అవగాహన పెంచి, చైతన్యం తీసుకువచ్చి, వారు రక్తదానం చేసేలా ప్రోత్సహిస్తున్నాను. నా సేవలు గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం అప్పటి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి పూనం మాలకొండయ్య చేతుల మీదుగా ఘనంగా సత్కరించింది. కలెక్టర్, జీవీఎంసీ కమిషనర్, మేయర్ చేతుల మీదుగా సత్కారాలు పొందాను. నా బాటలోనే నా కుమార్తెలు, కుమారులు ఏటా తప్పనిసరిగా రక్తదానం చేస్తున్నారు.'అని అప్పారావు వివరించారు. ఇదే సంస్థకు చెందిన పోలవరపు అప్పలకొండ 30 సార్లుకు పైగా రక్తదానం చేసి ఎంతో మంది ప్రాణాలు నిలబెట్టారు.

20సార్లు రక్తదానం


రక్తదానం చేస్తున్న కొమ్మోజు గణేష్ (ఫైల్)

ప్రతి ఇంటి నుంచి ఒక రక్తదాతను తయారు చేయడమే లక్ష్యంగా నిరంత ర సేవా ఫౌండేషన్‌ను స్థాపించి, ఇప్పటి వరకు 20 సార్లు రక్తదానం చేశారు అనకాపల్లికి చెందిన కొమ్మోజు గణేష్. ప్రజల్లో రక్తదానం పట్ల చైతన్యం పెంచేందుకు తెలుగు రాష్ట్రాల్లో 40 రక్తదాన శిబిరాలు నిర్వహించారు. దాదాపు 7 వేల మంది వలంటీర్లను సిద్ధం చేసి, అవసరమైన వారికి రక్తదానం చేయడంలో తన వంతు సాయపడుతున్నారు. కోవిడ్ సమయంలో నిరంతర సేవా ఫౌండేషన్ సేవల్ని గుర్తించి పలువురు అభినందించడంతోపాటు, కొన్ని సామాజిక సంస్థలు అవార్డులు కూడా అందించాయి.

26 సార్లు రక్తదానం చేశా



ఇప్పటివరకు 26 సార్లు రక్తదానం చేశా. 19 ఏళ్ల వయసు నుంచి రక్తదాన శిబిరాల్లో పాల్గొంటున్నా. ఈ ప్రాంతంలో రక్తం కొరత ఎక్కువగా ఉంది. ఈ సమస్య అధిగమించాలంటే ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలి. పాడేరులోని ఓ స్వచ్ఛంద సంస్థ రక్తహీనతతో బాధపడే గర్భిణులు, బాలింతలకు వైద్యసేవలు అందించేది. ప్రాణాపాయ పరిస్థితుల్లో రక్తం అందించి ఊపిరి పోసేది. ఆ సంస్థ స్ఫూర్తితో ఏటా రెండు సార్లు రక్తం దానం చేస్తున్నా.

– గట్టు సంతోష్‌కుమార్, ఫొటోగ్రాఫర్, పాడేరు

అపోహలు వద్దు



రక్తదానంపై ప్రజలు ఎలాంటి అపోహలు వద్దు. రక్తదానం వల్ల ఎలాంటి అనారోగ్య సమస్యలు ఉండవు. దాత నుంచి 400 మిల్లీలీటర్ల రక్తం కన్నా తక్కువే సేకరిస్తాం. ఈ ప్రక్రియ తరువాత కొన్ని గంటలు విశ్రాంతి తీసుకుంటే సరిపోతుంది. సంపూర్ణ ఆరోగ్యవంతులైన 18 నుంచి 60 ఏళ్ల మధ్య వయసు గల పురుషులు, మహిళలు రక్తదానం చేయవచ్చు.రక్తదానానికి 12 గంటల ముందు ఆల్కహాల్‌కు దూరంగా ఉండాలి.

– రూప, వైద్యాధికారి, రెడ్ క్రాస్ సొసైటీ, పాడేరు

నగరంలోని కొన్ని బ్లడ్ బ్యాంక్‌లు

- **రోటరీ బ్లడ్ బ్యాంక్:** డోర్ నంబర్ 13-26-2/54, అపురూప ఆర్కేడ్, మక్కా మసీదు పక్కన, జగదాంబ జంక్షన్. ఫోన్ నంబర్లు: 0891-2506678, 0891-6534635, పీఆర్వో వినోద్‌కుమార్: 88855 23020
- **లయన్స్ బ్లడ్ బ్యాంక్:** వాల్తేర్ మెయిన్ రోడ్డు, రాంనగర్, లయన్స్ క్లబ్, విశాఖపట్నం. ఫోన్ నంబర్లు 0891-6692587, 0891-6692580
- **ఏఎస్ రాజా వలంటరీ బ్లడ్ బ్యాంక్:** వాల్తేర్ మెయిన్‌రోడ్డు, కేర్ ఆస్పత్రి పక్కన, విశాఖపట్నం. ఫోన్ నంబర్లు 0891-2543436, 0891-6663436
- **ఎన్‌టీఆర్ ట్రస్ట్ బ్లడ్ బ్యాంక్:** వాల్తేర్ మెయిన్‌రోడ్డు, రాఘవేంద్రస్వామి గుడి పక్కన, లయన్స్ క్లబ్ ఎదురుగా, విశాఖపట్నం. ఫోన్ నంబర్లు 0891-2555858, 0891-2565858, 9032005607
- **రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంక్:** జిల్లా పరిషత్ దగ్గరలో, మహారాణిపేట, ఫోన నంబర్లు: 9491880025, 8331018934

రక్తదానంతో ఆరోగ్యం



ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలి. పాడేరులో పనిచేస్తున్న ఈ మూడేళ్లలో నాలుగు సార్లు రక్తదానం చేశా. తనతో పాటు మిగతా శాఖల అధికారులు, సిబ్బంది రక్తదానం చేస్తున్నారు. గిరిజన ప్రాంతాల్లో రక్తం అవసరాలు పెరిగినందున రక్తదాన శిబిరాలకు యువత అంతా ముందుకు రావాలి. రక్తం దానం చేయడం ఆరోగ్యానికి మంచిదని ప్రతి ఒక్కరూ గుర్తించాలి.

– వి.అభిషేక్, ఐటీడీఏ పీవో, పాడేరు

ఇంట్లో చోరీ..బంగారం అపహరణ


తెరిచి ఉన్న బీరువా తలుపులు, చిందరవందరగా దుస్తులు

కోటవురట్ల : అన్నవరం గ్రామంలో ఓ ఇంట్లో దొంగలు చొరబడి బంగారం, వెండి వస్తువులను దోచుకుపోయారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ రమణయ్య తెలిపిన వివరాలివి. గ్రామానికి చెందిన మంగ ఈ నెల 8వ తేదీన కొడవటిపూడిలోని తన పుట్టింటికి వెళ్లి, తిరిగి 12వ తేదీ సాయంత్రం 5 గంటలకు ఇంటికి వచ్చింది. ఇంట్లోకి వెళ్లి చూడగా ఇనుప బీరువా తెరిచి చెల్లాచెదురుగా దుస్తులు పడి ఉన్నాయి. ఇంటి వెనక తలుపులు తొలగించి ఉన్నాయి. దీంతో ఆందోళనతో బీరువాను వెతకగా అందులో దాచిన 3 తులాల బంగారు వస్తువులు, 12 తులాల వెండి వస్తువులు అపహరణకు గురైనట్టు తెలుసుకుని వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

ఇంటర్నెట్ షాపులో అగ్ని ప్రమాదం

- రూ.4.50 లక్షల నష్టం

యలమంచిలి రూరల్ : పట్టణంలోని ప్రధాన రహదారిపై స్టేట్‌బ్యాంకు పక్కనున్న ఎస్‌వీఎస్ ఇంటర్నెట్ షాపులో బుధవారం తెల్లవారుజామున అగ్ని ప్రమాదం సంభవించింది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా చెలరేగిన మంటలు దుకాణమంతా వ్యాప్తి చెందాయి. ఈ ప్రమాదంలో జెరాక్స్, లామినేషన్ మిషన్లు, ఫర్నిచర్, ఇతర వస్తువులు కాలి బూడిదయ్యాయి. ప్రమాద సమాచారం అందుకున్న వెంటనే యలమంచిలి అగ్నిమాపక కేంద్రం సిబ్బంది అగ్నిమాపక శకటంతో ఘటనా స్థలానికి చేరుకుని మంటలు అదుపు చేశారు. మొత్తం రూ.4.50 లక్షల వరకు ఆస్తి నష్టం వాటిల్లినట్టు స్థానిక అగ్నిమాపక అధికారి రాంబాబు మీడియాకు తెలిపారు.

పాము కాటుకు విద్యార్థి మృతి


మృతి చెందిన లక్ష్మి

పద్మనాభం (విశాఖ): బాందేవపురానికి చెందిన విద్యార్థిని పాము కాటుకు గురై.. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. ఎస్‌ఐ జె.సురేష్ తెలిపిన వివరాలివీ.. బోనెల సింహాద్రి, భార్య, కుమార్తె లక్ష్మి(14)తో అదే గ్రామంలో నివసిస్తున్నారు. ఉక్కపోతతో బుధవారం రాత్రి ఇంటి ఆరు బయట నిద్రకు ఉపక్రమించారు. ఈ క్రమంలో చినుకులు పడడంతో ఇంటి లోపలికి వెళ్లి గచ్చుపై నిద్రించారు. రాత్రి 1.30 గంటల సమయంలో లక్ష్మి కుడి కాలుపై పాము కాటేసింది. దీంతో ఆమెను విజయనగరం మహారాజా ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందించారు. అక్కడే చికిత్స పొందుతూ గురువారం ఉదయం ఆరు గంటల సమయంలో మృతి చెందింది. ఆమె 9వ తరగతి చదువుతోంది. లక్ష్మి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

డీఎస్‌ఎన్‌ఎల్‌యూలో ఎల్‌ఎల్‌బీ కోర్సు ప్రారంభం

సబ్బవరం: ఈ విద్యా సంవత్సరం నుంచి దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయంలో ఎల్‌ఎల్‌బీ కోర్సును ప్రారంభిస్తున్నట్లు ఉపకులపతి ఆచార్య డి. సూర్యప్రకాష్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. జాతీయస్థాయిలో జరిగే ప్రవేశ పరీక్ష ద్వారా మూడేళ్ల ఈ కోర్సులో ప్రవేశాలు కల్పిస్తామన్నారు. ఆసక్తి గల విద్యార్థులు జూలై 12వ తేదీ వరకు ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. మరిన్ని వివరాల కోసం www.dsnlu.ac.inను సందర్శించవచ్చు.

రైల్వేస్టేషన్‌లో 9.5 కిలోల గంజాయి స్వాధీనం


గంజాయి నిందితులతో జీఆర్పీ, ఆర్పీఎఫ్ సిబ్బంది

తాటిచెట్లపాలెం (విశాఖ): విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో గంజాయి కలిగి ఉన్న ఇద్దరిని గవర్నమెంట్ రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వివరాలివీ.. రైల్వేస్టేషన్‌లో గురువారం గవర్నమెంట్ రైల్వే పోలీసులు, రైల్వే భద్రతా దళం సిబ్బంది సంయుక్తంగా పలు ప్లాట్‌ఫాంలలో ప్రయాణికుల లగేజీలను తనిఖీ చేశారు. ఈ క్రమంలో పశ్చిమ బెంగాల్‌కు చెందిన జులు రెహమాన్, రాజన్ ధండర్ బ్యాగుల్లో సుమారు రూ.47,500 విలువైన 9.5 కిలోల గంజాయిని గుర్తించారు. వీరిని అదుపులోకి తీసుకుని విచారించగా.. విశాఖ మీదుగా పశ్చిమ బెంగాల్‌కు గంజాయిని తరలిస్తున్నట్లు తెలిపారు. వీరిని అరెస్టు చేసి రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపరిచినట్లు జీఆర్పీ ఎస్‌ఐ జి.శ్రీనివాసరావు, ఆర్పీఎఫ్ ఎస్‌ఐ ఎల్.కీర్తిరెడ్డి తెలిపారు.

బక్రీద్ రోజు గోవులను వధిస్తే చర్యలు

అనకాపల్లి : బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకుని ఈనెల 17న గోవులను వధించినా, అక్రమంగా తరలించినా కఠిన చర్యలు తప్పవని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ బి.ప్రసాదరావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హైకోర్టు ఆదేశాల మేరకు బక్రీద్ నేపథ్యంలో గోవధను అరికట్టేందుకు జంతు సంరక్షణ కేంద్రాలను, జిల్లా, పట్టణ, మండల, గ్రామీణ పంచాయితీ స్థాయిలో అధికారులను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. రాష్ట్ర పశుసంవర్ధకశాఖ ఆదేశాల మేరకు డాక్టర్ జి.శ్రీనివాసరావు సహాయ సంచాలకులు డాక్టర్ పి.భానుబాబు, పశు వైద్య శస్త్రచికిత్సకులను జిల్లా నోడల్ అధికారులుగా నియమించామన్నారు. గోవధ నిషేధం, జంతు సంరక్షణ చట్టం 1977, జంతు రవాణా నియమాలు 1978, 2001, జంతువధశాల నియమాలు, 2001 అమలయ్యేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. బక్రీద్ రోజున జంతు సంరక్షణ చట్టాలు తప్పక పాటించాలని, అతిక్రమించిన వారిపై పోలీసు, రెవెన్యూ అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

ఇద్దరు గంజాయి స్మగ్లర్లకు పదేళ్ల జైలు

చోడవరం: గంజాయి అక్రమ రవాణా కేసులో ఇద్దరు నిందితులకు పదేళ్లపాటు జైలు శిక్ష విధిస్తూ చోడవరం తొమ్మిదో అదనపు జిల్లా కోర్టు గురువారం తీర్పు చెప్పిందని ఎస్పీ కె.వి.మురళీకృష్ణ తెలిపారు. ఈ కేసులో చీడికాడ మండలం బైలపూడి గ్రామానికి చెందిన నిందితులు జాజిమొగ్గల అప్పారావు (28), జాజిమొగ్గల అర్జున (35)లకు కోర్టు జైలు శిక్ష విధించిందని పేర్కొన్నారు. ఎస్పీ తెలిపిన వివరాలు.. 2015 అక్టోబరు 3వ తేదీన అప్పారావు, అర్జున కలిసి రెండు బస్తాలతో గంజాయిని రవాణా చేస్తూ పట్టుబడ్డారు. వీరిద్దరూ చీడికాడ మండలం బైలపూడి గ్రామ సమీపంలో గంజాయి బస్తాలను తరలించేందుకు ప్రయత్నిస్తుండగా చీడికాడ ఎస్‌ఐ ఎ.కోటేశ్వరరావు తన సిబ్బందితో వెళ్లి పట్టుకున్నారు. వారి నుంచి 32 కేజీల గంజాయితోపాటు రూ.64 వేల నగదు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు. వాదనలు జరిగిన అనంతరం చోడవరం తొమ్మిదో అదనపు జిల్లా న్యాయమూర్తి కె.రత్నకుమార్ నిందితులకు పదేళ్ల జైలు శిక్ష, రూ.లక్ష జరిమానా విధించినట్టు ఎస్పీ చెప్పారు. జరిమానా కట్టలేని పక్షంలో అదనంగా మరో ఏడాదిపాటు జైలు శిక్ష అనుభవించాలని తీర్పులో పేర్కొన్నట్టు చెప్పారు. కేసు దర్యాప్తు చేసిన చీడికాడ ఎస్‌ఐని ఆయన అభినందించారు.

ఘనంగా పునీత ఆంథోనీ చర్చి పండగ


చర్చి పండగలో పాల్గొన్న క్రైస్తవులు


ప్రసంగిస్తున్న గురువులు

దాబాగార్డెన్స్ (విశాఖ): ఎంతో చరిత్ర గల పునీత ఆంథోనీ చర్చి పండగ గురువారం వేడుకగా నిర్వహించారు. గత నెల 31 నుంచి నవదిన ప్రార్థనలు ప్రారంభమయ్యాయి. తొమ్మిది రోజుల పాటు ఈ ఉత్సవాలు నిర్వహించారు. ఈ పండగకు విశాఖ నుంచే గాక కోస్తాంధ్ర జిల్లాల నుంచి భక్తులు అశేషంగా తరలివచ్చారు. పునీత ఆంథోనీ జీవిత విశేషాలను స్మరించుకున్నారు. హాజరైన గురువులు వివిధ అంశాలపై ప్రసంగించారు. సెయింట్ ఆంథోనీ పండగను పురస్కరించుకొని సాయంత్రం విశాఖ అగ్ర పీఠాధిపతి ఇన్‌చార్జ్ బిషప్ పి.జయరావ్, సెయింట్ ఆంతోనీ చర్చ్ విచారణ గురువు బాలశౌరి ప్రత్యేక పూజలు జరిపారు. విచారణ గురువు ఫాదర్ డి.బాలశౌరి పర్యవేక్షణలో ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు తిరువీధి ప్రదక్షిణ, దివ్యపూజ బలితో ఈ వేడుకలు ముగిశాయి. తిరువీధి ప్రదక్షిణ చర్చి వద్ద ప్రారంభమై దిబ్బలపాలెం, జగదాంబ జంక్షన్, దండుబజార్, భుజంగరావుపేట, రామజోగిపేట, అంథోనీనగర్, సెయింట్ ఆంథోనీ హైస్కూల్(గుడి చుట్టూ) మీదుగా పునీత ఆంథోనీ దేవాలయం వరకు సాగింది. అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

పరిహారంతో పిల్లలను బాగా చదివించండి

- నగర పోలీస్ కమిషనర్ రవిశంకర్
- గంగవరం జీపీఎస్ ఉద్యోగులతో ఆత్మీయ సమ్మేళనం


ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న నగర పోలీస్ కమిషనర్ రవిశంకర్

పెదగంట్యాడ (విశాఖ): ఇప్పటి వరకూ ఎన్నో కష్టనష్టాలకు ఓర్చారు.. ఇప్పుడు మీ భవిష్యత్తు మీ చేతుల్లోనే ఉందని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ అన్నారు. అదానీ గంగవరం పోర్టులో పని చేస్తూ ఇటీవల వన్‌టైమ్ సెటిల్‌మెంట్ చేసుకున్న జీపీఎస్ (ఆర్‌అండ్‌ఆర్) ఉద్యోగుల కుటుంబాలతో ఆటోనగర్‌లోని ఐలా ఫంక్షన్ హాల్‌లో గురువారం రాత్రి ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన సీపీ మాట్లాడారు. కార్మికులు తమ భవిష్యత్తు కోసం ఎన్నో పోరాటాలు చేశారని, గంగవరం పోర్టులో మరి పని చేయలేమని స్పష్టం చేయడంతోనే వారికి వన్‌టైమ్ సెటిల్‌మెంట్ చేశామని చెప్పారు. పోర్టు యాజమాన్యం ఇచ్చే పరిహారంతో మీ పిల్లల భవిష్యత్తు కోసం వినియోగించుకోవాలని సూచించారు. డబ్బును వృథా చేసుకోవద్దని, అలాగే ఎవరూ ఖాళీగా ఉండకుండా పనులు చేసుకుంటూ కుటుంబాలను పోషించుకోవాలని చెప్పారు. ఒక సంస్థతో కార్మికుల సంబంధం తెగిపోవడం బాధాకరమని.. తప్పనిసరి పరిస్థితుల్లో ఇటు కార్మికులు, అటు యాజమాన్య ప్రతినిధులతో సుదీర్ఘంగా చర్చించి ఇరు వర్గాలకు న్యాయం చేశామని భావిస్తున్నామన్నారు. భవిష్యత్తు కోసం గ్రామ పెద్దలు, మహిళలంతా కలిసి ఒక ప్రణాళిక ప్రకారం నడుచుకోవాలన్నారు. భవిష్యత్తులో ఏ అవసరం వచ్చినా పోలీసులు మీ వెంటే ఉంటారని హామీ ఇచ్చారు. అనంతరం కార్మికులంతా సీపీని ఘనంగా సత్కరించి కృతజ్ఞతను చాటుకున్నారు. అదానీ గంగవరం పోర్టు సీఈవో అమిత్ మాలిక్ మాట్లాడుతూ మత్స్యకార కుటుంబాలతో పోర్టు కలిసే ఉంటుందన్నారు. ఇప్పటికే సీఎస్సార్ నిధుల నుంచి ఆయా గ్రామాలకు సౌకర్యాలు కల్పిస్తున్నామని తెలిపారు. ఈ సమావేశంలో జాయింట్ కమిషనర్ ఎస్.ఫకీరప్ప, డీసీపీ-2 మోకా సత్తిబాబు, ఏసీపీ మోసెస్‌పాల్, ఏసీపీ త్రినాథ్, న్యూపోర్టు సీఐ దాలిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఐసీ హౌసింగ్ ఫైనాన్స్ కార్యాలయం ప్రారంభం

దాబాగార్డెన్స్ (విశాఖ): ఎల్‌ఐసీ హౌసింగ్ ఫైనాన్స్ నూతన క్లస్టర్ కార్యాలయం గురువారం ప్రారంభమైంది. ఎల్‌ఐసీ జీవన్ సమృద్ధి ప్రాంగణంలోని నాలుగో అంతస్తులో ఆ సంస్థ రీజనల్ మేనేజర్ తపన్‌కుమార్ పట్నాయక్ ఈ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖపట్నం, విజయనగరం, గాజువాక, రాజమండ్రి, కాకినాడ, తుని, భీమిలి ప్రాంతాల కార్యాలయాలకు సంబంధించి గృహ రుణాల మంజూరుకు వీలుగా ఈ క్లస్టర్ కార్యాలయం పని చేస్తుందని తెలిపారు. ఎల్‌ఐసీ అనుబంధ సంస్థ అయిన హౌసింగ్ ఫైనాన్స్ సౌత్ ఈస్టర్స్ రీజనల్ కార్యాలయం హైదరాబాద్‌లో ఉందని, గృహ రుణాల మంజూరులో ఇది దేశంలోనే ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు.

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.13 వేల కోట్ల పైబడి రుణ వితరణ లక్ష్యంతో పని చేస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో సంస్థ రీజనల్ హెడ్(మార్కెటింగ్) వైవీవీఎస్ రామకృష్ణారావు, క్లస్టర్ హెడ్ విజయశ్రీ, ఎల్‌ఐసీ సీనియర్ డివిజనల్ మేనేజర్ శారదా ప్రసాద్‌దాస్, మేనేజర్(ఆపరేషన్స్) వైకేకే శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

పలు రైళ్లు రీ షెడ్యూల్



తాటిచెట్లపాలెం (విశాఖ): పలు పెయిరింగ్ రైళ్లు ఆలస్యంగా నడుస్తున్నందున ఆయా స్టేషన్ల నుంచి బయల్దేరాల్సిన రైళ్లు ఆలస్యంగా బయల్దేరుతున్నట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు.

- గురువారం ఉదయం 8.50 గంటలకు బయల్దేరాల్సిన ఎస్ఎంవీ బెంగళూరు- హతియా (12836) ఎక్స్‌ప్రెస్ సుమారు 2 గంటలు ఆలస్యంగా ఉదయం 10.30 గంటలకు బయల్దేరింది.
- గురువారం ఉదయం 10.15 గంటలకు బయల్దేరాల్సిన ఎస్ఎంవీ బెంగళూరు-హౌరా (12864) ఎక్స్‌ప్రెస్ సుమారు 2గంటలు ఆలస్యంగా మధ్యాహ్నం 12.30 గంటలకు బయల్దేరింది.

క్లుప్తంగా

'ప్రభుత్వ ధరలకే విత్తనాలు, ఎరువులు'

కశింకోట: ఖరీఫ్ సీజన్‌లో రైతులకు విత్తనాలు, ఎరువులు పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలని మండల వ్యవసాయ అధికారి ఎం.స్వప్న ఎరువుల డీలర్లను సూచించారు. స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయంలో గురువారం మండలంలోని ప్రైవేట్ ఎరువుల డీలర్లు, పీఏసీఎస్, ఆర్బీకే సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఎరువులను ప్రభుత్వం నిర్దేశించిన ధరలకే అందించాలన్నారు. ఆర్బీకేల ద్వారా యూరియా, డీఏపీ ఎరువులను అందించ నున్నట్లు వెల్లడించారు. డీలర్లు కూడా రైతులకు కావాల్సిన ఎరువుల్ని సిద్ధం చేసుకుని, ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు విక్రయించాల్సిందిగా సూచించారు.

70 శాతం విద్యా కానుక కిట్లు సిద్ధం

కశింకోట: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు అందించేందుకు 70 శాతం మేర విద్యా కానుక కిట్లను పాఠశాలలకు పంపిణీ చేసినట్లు ఎంఈవో కె.చిట్టిబాబు గురువారం తెలిపారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో సుమారు 6 వేల మంది విద్యార్థులున్నారని పేర్కొన్నారు. విద్యా కానుకలో అన్ని తరగతులకు చెందిన పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలతోపాటు షూస్ తదితర సామగ్రి ఆయా స్కూళ్లకు అందించామన్నారు. స్కూల్ బ్యాగ్‌లు, యూనిఫాం మాత్రం రావాల్సి ఉందన్నారు.

పెరిగిన కూరగాయల ధరలు

కశింకోట: స్థానిక వారపు సంతలో గురువారం కూరగాయల ధరలు పెరిగాయి. టమాటా కిలో రూ.60 నుంచి రూ.70కి పెరిగింది. బంగాళాదుంప రూ.30 నుంచి రూ.40, ఉల్లిపాయ, క్యారెట్, బీట్రూట్, వంకాయ, బెండకాయ రూ.40, చేమదుంప, బీరకాయ రూ.60కి విక్రయాలు సాగాయి.

రెడ్డీస్ ఫౌండేషన్ సాయంతో సైకిల్ షెడ్



కశింకోట బాలికల హైస్కూల్లో సైకిల్ షెడ్‌ను ప్రారంభిస్తున్న ఎంఈవో చిట్టిబాబు

కశింకోట: స్థానిక బాలికల హైస్కూల్‌కు డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థుల సౌకర్యార్థం సైకిల్ షెడ్ నిర్మించారు. దీనికి రూ.లక్షన్నర వెచ్చించారు. ఈ షెడ్‌ను ఎంఈవో చిట్టిబాబు గురువారం ప్రారంభించారు. హెచ్‌ఎం ఎంఎస్ స్వర్ణకుమారి, ఉపాధ్యాయ సిబ్బంది, స్కూల్ కమిటీ చైర్మన్ యల్లపు శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లి సినిమాలు

మహారాజ	: రాజా
మనమే	: సత్యనారాయణ స్క్రీన్-1
మ్యూజిక్‌షాప్ మూర్తి	: సత్యనారాయణ స్క్రీన్-2
భజే వాయు వేగం	: షిర్డిసాయి
లవ్ మౌళి	: పర్తిసాయి
సత్యభామ	: వెంకటేశ్వర
యేవమ్	: శ్రీసత్య
హరోం హర	: రామచంద్ర

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు గురువారం 309 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,640	5,240
రెండో రకం	4,060	4,510
మూడో రకం	3,580	4,020

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 46 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-10 యూనిట్లు, బీ పాజిటివ్-20 యూనిట్లు, ఓ పాజిటివ్-15 యూనిట్లు, ఏబీ పాజిటివ్-1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష(9703619706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా గురువారం 355 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 311 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ (0892 4223595)ని సంప్రదించవచ్చు.

పక్కా కొలువు.. డిప్లొమా చదువు

- టెన్త్ తర్వాత పాలిటెక్నిక్ కోర్సులపై ఆసక్తి
- మూడేళ్ల డిప్లొమాతో ఉద్యోగాలు దక్కించుకుంటున్న యువత
- రేబాక పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులకు ఉపాధి అవకాశాలు

అనకాపల్లిలోని రేబాక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో డిప్లొమా పూర్తి చేస్తే చాలు.. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయన్న నమ్మకం. గత ప్రభుత్వంలో రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ చొరవతో కళాశాలలో ప్రాక్టికల్ నాలెడ్జ్‌కు అవసరమైన అన్ని వసతులు కల్పించారు. దీంతో గత విద్యా సంవత్సరంలో కళాశాలలో వివిధ సంస్థలు నిర్వహించిన ప్లేస్‌మెంట్ ఇంటర్వ్యూల ద్వారా 58 మంది ఉద్యోగాలు పొందారు.



అనకాపల్లి మండలం రేబాకలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల



కళాశాలలోని కంప్యూటర్ ల్యాబ్

తుమ్మపాల: ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పనకు కేరాఫ్ అడ్రస్‌గా ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలు నిలుస్తున్నాయి. డిప్లొమాతోపాటు, ఉద్యోగం కూడా వస్తుందన్న నమ్మకంతో టెన్త్ తర్వాత విద్యార్థులు పాలిటెక్నిక్‌లో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఇందులో అనకాపల్లి(రేబాక) ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ముందంజలో నిలుస్తుంది. డిప్లొమా పూర్తయ్యే సరికి ప్రతి విద్యార్థి ఉద్యోగం పొందేలా అవసరమైన నైపుణ్యాలను ఈ కళాశాలలో అందిస్తున్నారు.

సాంకేతిక విద్యాశాఖ ప్రత్యేక దృష్టి

గత ప్రభుత్వంలో రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ కమీషనర్‌గా సి.నాగరాణి (ఐఏఎస్)బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి నేటి వరకు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల విద్యార్థులకు సుమారుగా 6 వేలకు పైగా ఉద్యోగాలు కల్పన జరిగింది. ఆమె ప్రత్యేక చొరవ తీసుకుని విద్యార్థులకు ఉపాధి అవకాశాలతో పాటు కళాశాలల్లో ఆధునిక టెక్నాలజీ గల ల్యాబ్, కంప్యూటర్‌ల ఏర్పాటుకు కృషి చేస్తున్నారు. ఉద్యోగాల కల్పనకు తగిన విధంగా విద్యార్థులను తీర్చిదిద్దుతున్నారు. ప్రైవేటు కళాశాలల కన్నా మరింత ధీటుగా ప్రభుత్వ సాంకేతిక కళాశాలలు పోటీపడుతు విద్యార్థులకు డిప్లమాతోనే ఉద్యోగం అందిస్తున్నాయి.

58 మంది విద్యార్థులకు ఉద్యోగాలు

జిల్లా కేంద్రంగా ఉన్న అనకాపల్లి(రేబాక) ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఎందరో విద్యార్థుల జీవితాలకు భరోసాగా నిలుస్తోంది. అధునాతన భవనాలు, సువిశాల వాతావరణంలో నిర్మితమైన ఈ కళాశాలకు జిల్లాలోని అన్ని ప్రాంతాలతో పాటు, విశాఖ జిల్లా నుంచి సైతం విద్యార్థులు వస్తున్నారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఏర్పాటైన ల్యాబ్, అధ్యాపకుల నిరంతర శ్రమ, ప్రత్యేక దృష్టితో విద్యార్థుల వ్యక్తిగత నైపుణ్యంపై శిక్షణ, కమ్యూనికేషన్స్ తదితర అంశాల్లో విద్యార్థులు ముందుండేలా తీర్చిదిద్దుతున్నారు. దీంతో కళాశాలకు గతేడాది ఎన్‌బీఏ గుర్తింపు కూడా దక్కింది. ఇక్కడ డిప్లొమా పూర్తి చేసుకున్న విద్యార్థులకు నెలకు కనీసం రూ.22 వేలు జీతం అందించే సంస్థలతో కళాశాల ఒప్పందాలు చేసుకుంది. తాజాగా డిప్లొమా పూర్తి చేసుకున్న 58 మంది విద్యార్థులు వివిధ సంస్థల్లో ఉద్యోగాలు పొందారు. గరిష్టంగా రూ.8.6 లక్షల వార్షిక వేతనం అందుకోవడం విశేషం.

థాట్ వర్క్స్‌లో ఉద్యోగం



నేను రేబాక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో డిప్లొమా పూర్తిచేశాను. మా కళాశాలలో మాకు అవసరమైన అన్ని వసతులు ఉన్నాయి. చదువుతో పాటు ఉద్యోగం పొందేందుకు పలు అంశాల్లో ప్రత్యేక శిక్షణ అందించి, నైపుణ్యం పెంపొందించారు. కళాశాలలో జరిగిన ఇంటర్వ్యూలో బెంగళూరుకు చెందిన థాట్ వర్క్స్ సంస్థకు ఎంపికయ్యాను. ఏడాదికి రూ.8 లక్షల ప్యాకేజ్‌తో ఉద్యోగం వచ్చింది.

– మరిసా ప్రజ్ఞ, కళాశాల విద్యార్థి

రూ.8.6 లక్షల వార్షిక వేతనం



ఎన్‌బీఏ గుర్తింపు పొందిన కళాశాల కావడంతో గతంలో ఉన్న సౌకర్యాలతో పాటు మరిన్ని వసతులు మాకు అందాయి. అత్యుత్తమ బోధనే కాకుండా, ప్రాక్టికల్స్‌పై ప్రత్యేక తరగతులు తీసుకుంటారు. చెన్నైలోని టెక్సాస్ కంపెనీలో రూ.8.6 లక్షల వార్షిక వేతనంతో ఉద్యోగం పొందాను. అధ్యాపకుల ప్రత్యేక చొరవ, ప్రోత్సాహం కారణంగానే మేం ఇంత మంచిగా స్థిరపడ్డాం. చాలా ఆనందంగా ఉంది.

– రాయి ఉమామహేష్, ఈసీఈ విద్యార్థి

డిప్లొమాతోపాటే ఉద్యోగం



మా కళాశాలలో చదివే ప్రతి విద్యార్థి ఉద్యోగ ఆఫర్ లెటర్‌తో బయటకు వెళ్లాలన్న లక్ష్యంతో కృషి చేస్తున్నాం. రాష్ట్ర కమిషనర్ నాగరాణి సహకారంతో విద్యార్థులకు అవసరమైన అన్ని వసతులు ఏర్పాటు చేశాం. అత్యధిక వేతనాల(రూ.8 లక్షల నుంచి రూ.8.6 లక్షల)తో ఐదుగురు విద్యార్థులు ఎంపికయ్యారు. మిగిలిన విద్యార్థులు కూడా వివిధ కంపెనీల్లో మంచి ఉపాధి అవకాశాలు పొందారు.

– ఐవీఎస్ఎస్ శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్

ఉపాధి కూలీల వేతనాలు పెంచాలి



కూలీలతో మాట్లాడుతున్న రాజాన దొరబాబు

అనకాపల్లి: గ్రామీణ ఉపాధి హామీ కార్మికులకు 200 రోజుల పని దినాలు కల్పించి, రోజుకి రూ.600 వేతనం చెల్లించేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజాన దొరబాబు డిమాండ్ చేశారు. మండలంలోని మారేడుపూడి గ్రామంలో ఉపాధి హామీ కూలీలతో గురువారం ఆయన మాట్లాడారు. కేంద్రంలో ఎన్డీయే ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని క్రమంగా ఎత్తివేసే కుట్రలో భాగంగా బడ్జెట్ కేటాయింపుల్లో కోత విధిస్తోందని ఆరోపించారు. ఉపాధి హామీ చట్టం పటిష్టంగా అమలు చేయడానికి కావలసిన నిధులను కేంద్ర ప్రభుత్వం పెంచాలని, కార్మికులు పనులు చేసే ప్రదేశాల్లో ప్రభుత్వమే మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా నాయకుడు నారాలశెట్టి సత్యనారాయణ, ఉపాధి కార్మికులు సాయి కుమారి, వెంకటలక్ష్మి, భవాని, గౌరి, గౌరీదేవి, శివ లక్ష్మి, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అనకాపల్లి: విద్యుత్ శాఖ స్థానిక డి1 సెక్షన్ పరిధిలో శుక్రవారం పలు మరమ్మతు పనుల నిమిత్తం ఉదయం 10 నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈపీడీసీఎల్ ఈఈ కె.రాజశేఖర్, డి1 సెక్షన్ ఏఈ శ్రీనివాసరావులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. దీంతో 11కేవీ ఫీడర్ పరిధి లక్ష్మీనారాయణనగర్, ఉడ్‌పేట, గవరపాలెం, పూల్‌బాగ్‌రోడ్డు, నూకాంబిక కోల్డ్ స్టోరేజ్ ప్రాంతాల్లో విద్యుత్‌ను నిలిపివేయనున్నట్లు వెల్లడించారు. ఆయా ప్రాంతాల ప్రజలు తమ సిబ్బందికి సహకరించాల్సిందిగా కోరారు.

వడివడిగా బడికి..



కశింకోట బాలికల హైస్కూల్లో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

రోజంతా సందడి నిండిన ఇల్లు కాస్తా మూగబోయింది. ఎండ, ఉక్కబోత ఎరుగని ఆట పరికరాలు అటకెక్కాయి. నెలన్నరకు పైగా బామ్మ, తాతయ్యల మోముల్లో వెల్లివిరిసిన ఆనందపు ఆనవాళ్లను వచ్చే వేసవి వరకు దాచుకోమంటూ.. చిన్నారులు బడిబాట పట్టారు. వేసవి సెలవులు ముగిసి, గురువారం పాఠశాలలు పునఃప్రారంభమయ్యాయి.

- ముగిసిన వేసవి సెలవులు
- బడిబాట పట్టిన విద్యార్థులు

అనకాపల్లి/కశింకోట: వేసవి సెలవులు ముగియడంతో విద్యా సంస్థలు పిల్లలతో కళకళలాడాయి. ప్రైవేట్ విద్యా సంస్థలతోపాటు కొన్ని ప్రభుత్వ పాఠశాలల్లో కూడా కొత్త విద్యా సంవత్సరానికి వినూత్నంగా ఆహ్వానం పలుకుతూ పాఠశాల ఆవరణలను బెలూన్లు, తోరణాలతో అందంగా అలంకరించారు. తొలి రోజు కావడంతో ప్రభుత్వ యాజమాన్యంలోని పలు పాఠశాల్లో విద్యార్థుల హాజరు తక్కువగా నమోదయింది.

60 శాతం కిట్లు మాత్రమే వచ్చాయి

గత ప్రభుత్వంలో పాఠశాలలు తెరిచిన తొలి రోజే విద్యార్థులకు విద్యా కానుక కిట్లు అందించేవారు. ఈ ఏడాది కూడా అదే విధంగా కిట్లు అందిస్తారనుకున్నారు. అయితే కొత్త ప్రభుత్వం రావడంతో విద్యా కానుక కిట్ల పంపిణీలో స్తబ్ధత నెలకొంది. ఈ ఏడాది విద్యా కానుక కిట్లు పూర్తిగా పాఠశాలలకు, మండల కేంద్రాలకు చేరలేదు. దాదాపు 60 శాతం మాత్రమే కిట్లు వచ్చినట్లు విద్యాశాఖ సిబ్బంది చెప్తున్నారు. పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, బూట్లు చాలా వరకు చేరినా, స్కూల్ బ్యాగ్‌లు, యూనిఫాం ఇంకా రాలేదు.

మండల కేంద్రాలకు వచ్చిన పాఠ్యపుస్తకాలను పాఠశాలలకు తరలించే ఏర్పాట్లు చేశారు. ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు రెండు రోజుల్లో ఈ కిట్లను పంపిణీ చేయనున్నట్లు అధికారులు చెప్తున్నారు. కొత్త ప్రభుత్వ ప్రొటోకాల్ అమలు నేపథ్యంలో జాప్యం నెలకొన్నట్లు పేర్కొంటున్నారు.



అనకాపల్లి వేల్పులవీధి బాలికల హైస్కూల్లో ప్రార్థన అనంతరం విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో వెంకటలక్ష్మమ్మ

ఆర్బీకేల ద్వారా విత్తనాల పంపిణీకి చర్యలు



మొలకలు రాగానే లెక్కించేందుకు వాక్స్, బటర్ పేపర్‌లో ఉంచిన వరి విత్తనాలు



మొలకలు వచ్చిన పచ్చిరొట్ట విత్తనాలు

కశింకోట: మండలంలోని రైతులకు ఖరీఫ్ సీజన్లో వేసే వరి విత్తనాలు, ఎరువులు రైతు భరోసా కేంద్రాల ద్వారా సరఫరా చేసేందుకు వ్యవసాయ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే 40 శాతం వరి విత్తనాలు ఆర్బీకేలకు చేరాయి. వీటిలో ఆర్‌జీఎల్, బీపీటీ 3291 రకాలు ఉన్నాయి. విత్తనాల్లో మొలక శాతాన్ని లెక్కించే పనిలో అధికారులున్నారు. ఒక్కో రోల్‌లో వంద గింజలను వాక్స్, బటర్ పేపర్‌లలో కట్టి, వాటిలోని తేమ వల్ల మూడు రోజులకు మొలకలు వస్తాయి. వాటి ఆధారంగా మొలకల శాతాన్ని లెక్కించేందుకు చర్యలు చేపట్టారు. భూమి సారవంతానికి ఉపకరించే పచ్చి రొట్ట విత్తనాలకు కూడా మొలకలు కట్టారు. మూడు రోజుల తర్వాత విత్తనాల నాణ్యతపై సంతృప్తి చెందితే, వాటి పంపిణీకి చర్యలు తీసుకోనున్నట్లు మండల వ్యవసాయ అధికారి ఎం.స్వప్న తెలిపారు. విత్తనాలు కావలసిన రైతుల వివరాలను ముందుగా నమోదు చేసుకుని, ఆ మేరకు వారికి విత్తనాలను అందిస్తామన్నారు.

అవగాహనతోనే ప్లాస్టిక్ నియంత్రణ



విద్యార్థులచే పర్యావరణ పరిరక్షణపై ప్రతిజ్ఞ చేయిస్తున్న హెచ్‌ఎం అప్పారావు, ఉపాధ్యాయులు

కశింకోట: పర్యావరణానికి ముప్పుగా పరిణమిస్తున్న ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నియంత్రించాలని స్థానిక డీపీఎన్ జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం ఎంఆర్‌వీ అప్పారావు అన్నారు. హైస్కూల్ ఎకో క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణపై గురువారం అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకం వల్ల జరిగే అనర్థాలను తల్లిదండ్రులకు వివరించి వారిలో అవగాహన పెంచాలన్నారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, వాటి సంరక్షణ పట్ల శ్రద్ధ చూపాలన్నారు. ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణకు కట్టుబడి ఉంటామంటూ విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఆచంట రవి, కాండ్రేగుల అప్పారావు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి హామీ'కి బడ్జెట్ పెంచాలి



ఉపాధి పనులు పరిశీలిస్తున్న సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కోటేశ్వరరావు

పరవాడ: గ్రామీణ జాతీయ ఉపాధి హామీ పథకానికి బడ్జెట్‌లో నిధులు పెంచి మౌలిక సదుపాయాలు కల్పించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. పరవాడలో జరుగుతున్న చెరువు పనులను ఆయన పరిశీలించారు. ఉపాధి కూలీలకు ఏడాదికి రెండు వందల రోజుల పనిదినాలు కల్పించి రోజుకు రూ.600 కూలి చెల్లించే విధంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలన్నారు. కూలీలకు మౌలిక సదుపాయాలు కల్పించి పే స్లిప్‌లు మంజూరు చేయాలన్నారు. గతంలో కల్పించిన తట్ట, పార, గునపాం , మేట్లకు అదనంగా కూలి చెల్లించాలన్నారు. కూలీలకు టెంట్లు, మంచినీరు సదుపాయాలు కల్పించి కనీస వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఉపాధి కూలీలకు రూ.5 లక్షల ఇన్సూరెన్స్ కల్పించి మూడు వారాల బకాయి డబ్బులు చెల్లించాలని కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ పాల్గొన్నారు.

ఘనంగా కైలాసేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం



కాత్యాయిని సమేత కైలాసేశ్వరస్వామి కల్యాణం

రాంబిల్లి: కట్టుబోలు గ్రామంలో గురువారం శ్రీ కాత్యాయిని సమేత కైలాసేశ్వరస్వామి కల్యాణం ఘనంగా జరిగింది. పురోహితులు శాస్త్రోక్తంగా కల్యాణ మహోత్సవాన్ని కనులపండవగా నిర్వహించారు. భక్తులు స్వామివారు అమ్మవార్లను దర్శించుకొని పూజలు చేశారు. భారీ అన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయాన్ని , ఆలయ పరిసరాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించారు.

ఉపాధి కార్మికుల ఆందోళన



ఐద్వా ఆధ్వర్యంలో ఎంపీడీవో కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న కూలీలు

పరవాడ: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం బడ్జెట్‌ను పెంచాలని అనకాపల్లి జిల్లా ఐద్వా అధ్యక్షురాలు పి.మాణిక్యం డిమాండ్ చేశారు. ఐద్వా ఆధ్వర్యంలో ఎంపీడీవో కార్యాలయం వద్ద ఉపాధి కూలీల సమస్యలపై ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాణిక్యం మాట్లాడుతూ పి.బోనంగి గ్రామంలో ఉపాధి కూలీలకు పని కల్పించాలని డిమాండ్ చేశారు. ఏడాది పొడవునా పనులు లేక కూలీలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. దీపి కారణంగా జీవనోపాధి కష్టంగా ఉందన్నారు. ఉపాధి పనులతో పాటు మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జి.రమణమ్మ, రామలక్ష్మి, వెంకటలక్ష్మి, నూకరత్నం, రమణమ్మ, జయలక్ష్మి, సింహచలం, నూకాలమ్మ పాల్గొన్నారు.

దివ్యాంగులకు అన్నదానం



వృద్ధులకు, సాధువులకు వస్త్రాలను పంపిణీ చేస్తున్న ముత్యాలరావు దంపతులు

సబ్బవరం: వెదుళ్ల నరవలో మంజుశ్రీ-పునీత్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం దివ్యాంగులు, అనాథలకు అన్న ప్రసాద వితరణతో పాటు వస్త్ర పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. వెదుళ్లనరవలోని వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు బొట్టా ముత్యాలరావు కుమార్తెలు మంజుశ్రీ,పునీత్ కుమార్‌లు అనారోగ్యంతో బాధపడుతూ గత ఏడాది మృతి చెందడంతో వారి స్మారకార్థం ట్రస్టు ప్రారంభించినట్లు ముత్యాలరావు తెలిపారు. దీంతో నాటి నుంచి కష్టాల్లో ఉండి ఎటువంటి అండ లేని నిస్సాహయకులకు అండగా నిలిచేందుకు ఈ ట్రస్టు కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో భాగంగా వెదుళ్లనరవలోని తన స్వగృహంలో ముత్యాలరావు-మణి దంపతుల చేతుల మీదుగా దివ్యాంగులు,అనాథలకు అన్నప్రసాద వితరణ,నూతన వస్త్రాలతో పాటు నోట్ పుస్తకాలు, నగదు పంపిణీ చేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు ఉండని ప్రాంతాలు

సబ్బవరం : మండలంలోని సబ్బవరం సెక్షన్-1,సెక్షన్-2 పరిధిలోని సబ్బవరం, అంతకాపల్లి సబ్‌స్టేషన్ల పరిధిలోని 33/11 కేవీ విద్యుత్ లైన్ల నిర్వహణలో భాగంగా శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్ రామకృష్ణ గురువారం తెలిపారు. దీంతో మండలంలోని సబ్బవరం, అంకాపల్లి సబ్‌స్టేషన్‌ల పరిధిలోని అన్ని గ్రామాల్లో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిచిపోతుందన్నారు.

నేడు గణపర్తిలో వీరాంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవం

మునగపాక : మండలంలోని గణపర్తి వీరాంజయనేయ స్వామి 31వ వార్షికోత్సవాలను శుక్రవారం ఘనంగా నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం నుంచి ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరుగుతాయన్నారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో భారీ అన్న సమారాధన జరుగుతుందని, రాత్రికి ప్రత్యేక భజన కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్టు బాలాజీ నగర్ కాలనీ సభ్యులతో పాటు యూత్ సభ్యులు తెలిపారు. భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని నిర్వాహకులు కోరుతున్నారు.

ఘనంగా కొత్త మహాలక్ష్మి అమ్మవారి పండగ



కొత్తమహాలక్ష్మి అమ్మవారి ఊరేగింపులో భక్తులు

మునగపాక : మునగపాకలో కొత్త మహలక్ష్మి అమ్మవారి పండగ గురువారం ఘనంగా జరిగింది. ఉదయం నుంచి అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు తరలివచ్చారు. అమ్మవారి పండగ చేపట్టిన కుటుంబాలు డప్పు వాయిద్యాల నడుమ ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. అమ్మవారి పండగ సందర్భంగా భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా సంఘ అధ్యక్షులు బుద్ద వెంకట్‌తో పాటు కమిటీ సభ్యులు తగు చర్యలు తీసుకున్నారు. పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు దాడి ముసిలినాయుడు, మునగపాక ఉప సర్పంచ్ పెంటకోట సత్యనారాయణ, ఇందిరమ్మ కాలనీ అధ్యక్షుడు ఆడారి వెంకటప్పారావు అమ్మవారిని దర్శించుకున్నారు.

ఘనంగా గ్రామ దేవతల అనుపు ఉత్సవం



కుంచాలమ్మ సన్నిధిలో భక్తులు

సబ్బవరం: మండల కేంద్రంలో జోడుగుళ్లు, గోర్లవానిపాలెం గ్రామంలో వేంచేసి ఉన్న గ్రామ దేవతలు కుంచాలమ్మ,బంగారమ్మ అమ్మవార్ల అనుపు మహోత్సవం గురువారం వైభవంగా నిర్వహించారు. వేకువజాము నుంచి అధిక సంఖ్యలో భక్తులు ఆయా గ్రామాల్లోని అమ్మవార్లను దర్శించుకొని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మహిళలు పసుపు,కుంకుమ, చీరలు సమర్పించి మొక్కులు చెల్లించుకొన్నారు. అమ్మవారి సన్నిధిలో కోలాటం పోటీలు, నేల డ్యాన్స్‌లు, భారీ బాణసంచాతో అమ్మవారి ఊరేగించారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.